# చదువుకున్న భార్య

కోకా సుబ్రహ్మణ్యేశ్వరరావు, బి. ఏ.

మోహనరావు, ఎం. ఏ. పాసయ్యాడు. ఉద్యోగం కోసం దేవులాడాలనే చింతలేదు. కావలసినంత డబ్బు వుంది. వాళ్ళ తండ్రి అయిదు తరాలవరకూ చాలినంత ధనం సంపాదించి మరీ చనిపోయాడు. నలభై యేళ్ల తల్లి వుంది. ఆమె తన కొడుకు గృహస్థు డెప్పుడవుతాడాయని ఎదురుచూస్తూ వుంది. ఏదో మంచిగుణవతి అయిన పిల్ల, యింటి పనులు చూచుకొనే పిల్లనుచూచి పెండ్లి చెయ్యాలనుకుంది. కాని కొడుక్కి మాత్రం తను ఎం. ఏ., ప్యాసైనందుకు తన భార్యకూడా కనీసం ఇంటర్ అయినా ప్యాసై యుండాలనుకొన్నాడు. మదరాసులో ఎవరో బారిష్టరు కూతురు వుందనీ,ఇంటర్ వరకూ చదివిందనీ,చాలా చురుకైన పిల్లనీ వాళ్ళ స్నేహితుడు వ్రాయగా రాజమండ్రినుంచి మదరాసుకు బయలుదేరినాడు మోహనరావు.

మదరాసుకు వచ్చి రెండు మూడు రోజు లయింది. పోయి ఆ పిల్ల తల్లితండ్రులను కలుసుకొని, పిల్లను చూడాలనే యుబలాట మెక్కువయింది. రోజూ స్నేహితుడిని హెచ్చరిస్తూయున్నాడు కాని అతడికేమో తీరిక లేకుండాయుంది. అత డేమో ఇద్దరమూ కలిసి వెళ్తామంటాడు. చూస్తే తీరిక లేదు. ఆఖరుకి విసుగెత్తి స్నేహితుడు లేని సమయాన్ని అతని డైరీలో వాళ్ల అడ్రెసు చూచి బారిష్టరుగారి యింటికి బయలుదేరాడు.

బారిష్టరుగారి బంగాళా ట్రిప్లికేను పైక్రాఫ్ట్సు రోడ్డులో యుంది. ఆ యిలోంటినికి ప్రవేశించగానే అక్కడుండే కుక్క మొరగడం ప్రారంభించింది. మోహనరావు గాభరా పడ్డాడు. ఆ యింటివారి అల్లుడి నయినప్పుడు నీ పని పడ్తానని మనస్సులో అనుకున్నాడు. అక్కడుండే సర్వెంటును 'బారిష్టరుగా రున్నారా' అని అడిగాడు. వాడు 'వున్నారండీ, మీ రెవరండీ' అన్నాడు.

'నా పేరు మోహనరావు. నేను వారితో చాలా ముఖ్యమైన ఒక విషయాన్ని గురించి మాట్లాడడానికి వచ్చేను. మీతో ఎవరో మాట్లాడటానికి వచ్చేరని వారితో చెప్పమ'ని వానికి ఒక బేడకూడా సమర్పించాడు. అంతటితో వాడు "ఇక్కడ కూర్చుని వుండండి. నేను పోయి చెప్పివస్తాన'ంటూ లోనికి వెళ్ళాడు. మోహనరావు వెయిటింగు రూములో ఒక కుర్చీలో - కూర్చుని ఏవోవో ఆలోచించ సాగాడు. తన్ను బాగా గౌరవిస్తారో లేదో, తను పెళ్ళిచేసుకునే పిల్ల ఎల్లా వుంటుందో, ఆమెను ఒకసారి చూసే ప్రాప్త ముంటుందో లేదో అనే ఆలోచనలు అతనితలలో తిరుగుతున్నాయి.

ఇంతట్లోనే ఒక 18 ఏండ్ల యువతి నవీన నాగరికతను సూచించే దుస్తులతో ఆ గదిని ప్రవేశించి అతని ఆలోచనలకు అడ్డు తగిలింది. బారిష్టరుగారేమోనని లేచి నిలబడ్డాడు కాదు ధైర్యంతో "బారిష్టరుగారు వస్తున్నారా" అని అడిగాడు. ఆమె వినీ వినిపించుకోనట్లు వెలుపలికి వెళ్లి "డ్రైవర్, నన్ను బీచివద్ద దిగబెట్టు" మని కారులో కూర్చుని కారులో వెళ్లిపోయింది. యిప్పుడిలా పోయిన పిల్ల యెవరా అంటూ మోహనరావు ఆలోచిస్తూండగానే బారిష్టరుగారు ప్రవేశించారు.

మోహనరావును చూచి 'మీరేమి పనిమీద వచ్చారని' ప్రశ్నించాడు. మోహనరావు ధైర్యముతో 'నన్ను రామారావుగారు పంపించా' రన్నాడు.

'రామారావుగారేనా. అయితే ఏదో మా పిల్లకు మనువు కుదురస్తా మన్నారు. మిమ్మల్ని పంపి వారు రాలేదేమి?'

వారు ఏదో పనిమీద పోయినారు. నన్ను పోయి మిమ్మల్ని చూడమన్నారు.'

'మీ దేవూరండీ?'

'రాజమండ్రి.'

'నామధేయం?'

'మోహనరావు'

'మీ తండ్రిగా రెవరు?'

'డాక్టరు ముకుందరావు గారు.'

'ముకుందరావుగారా! ముకుందరావుగారి కుమారుళ్లా మీరు. ఏమి చేస్తున్నా రేంటి?'

'అవును. ఎం. ఏ., పాసయ్యాను. మా తండ్రిగారిని ఎరుగుదురా మీరు?'

'కొద్దిగా. వారూ నేనూ ఒకే యూరిలో కొంత కాలం యున్నాము. కొద్దిగా పరిచయం ఉండేది. మరి మా అమ్మాయిని గురించి రామారావుగారు మీకు చెప్పేరా?'

'నాకు వుత్తరం వ్రాస్తే నేను రాజమండ్రి నుంచి వచ్చేను.'

'మా అమ్మాయిని చేసుకోనేందుకు ఏమైనా అటంకా లున్నాయా? ఇంటర్ వరకూ చదివించాను. ఇప్పుడే బీచికి వెళ్లినట్టుంది.'

నాకేమీ అభ్యంతరం లేదు మీ యిష్టాన్ని కాదంటానా?'

★

పెండ్లి నిశ్చయమై జరిగిపోయింది కూడాను. మోహనరావు తన చదువుకు తగినట్టు ఇంటర్ ప్యాసైన భార్యను సంపాదించానని సంతోషించాడు. తల్లి వచ్చి పెండ్లి అయ్యేంతవరకూ వుండి తర్వాత తమ వూరికి వెళ్ళిపోయింది. మోహనరావు మాత్రం మామగారింట్లో మకాం వేశాడు. ఇలా 2 నెలలు గడిచే టప్పటికి తన తల్లి చాలా ప్రమాదావస్థలో నున్నట్టు సమాచారం తెలిసింది. రాజమండ్రి పోవడానికి బయలుదేరాడు. వెళ్ళేటప్పుడు తన భార్యతో ఏమైనా కోర్సుచదవమని వూరికే కాలం గడపవద్దనీ చెప్పి తాను వచ్చేది ఆలస్యమైతే మామగారితో చెప్పి మెడికల్ కాలేజీలో చదవమనీ చెప్పి మరీ పోయాడు.'

★

మోహనరావు వెళ్ళి 4 నెలలయింది. సుశీల-మోహనరావు పెళ్లాం. ఇంతవరకూ పేరు చెప్పలేదు క్షమించండి-మెడికల్ కాలేజీలో M.B., B.S., చదవడానికి చేరింది. ఈ సంగతి భర్తకు వ్రాసింది. భర్త చాలా సంతోషమైనట్లూ తాను త్వరలోనే వస్తున్నాననీ జవాబు వ్రాసాడు. సుశీల ప్రతిదినమూ కాలేజీకి పోవడం, సాయంత్రం నాలుగింటికి రావడం, మళ్ళీ అర గంటలోనే బీచికి ప్రయాణమవడమూ, యింటికి రాత్రి 9 గంటలకు రావడం-యిలా జరుగుతూంది. తన క్లాసులోనే చదువుతూన్న ప్రసాదరావుతో సుశీలకు పరిచయ మయింది. ఈ పరిచయమే క్రమంగా ప్రణయంలోకి దిగింది. సుశీల తనకు పెండ్లి అయిందనీ, భర్త అనేవాడు ఒక డున్నాడనే సంగతే మరచి పోయింది.

సుశీల, ప్రసాదరావులు ప్రతిరోజూ బీచివద్ద కలుసుకోవడం, రాత్రి తొమ్మిదింటి వరకూ సరస సల్లాపాలాడుకోడం-ఇదే దినవిధి అయింది. ఒకరోజు మోహన్ర్యావ్ స్నేహితుడు రామారావు, సుశీల ప్రసాద్‌లు ఒకరి చేతులు ఒకరు పట్టుకొని సముద్రపు టొడ్డున తిరగడం చూశాడు. వారి సంగతంతా కనిపెట్టాడు. రోజూ ఇలాగే జరుగుతూ వుందాలేదా అనే సందేహం పుట్టి పదిరోజుల వరకూ ఇలాగే చూచాడు. ఆయన సందేహం దృఢమయి పోయింది. ఆఖరుకు మోహనరావుకు సుశీల నడవడి ఏమీ బాగుండటం లేదనీ ఆమెను వెంటనే చదువు మాన్పించి, కాపరానికి తీసుక వెళ్ళమనీ, వెంటనే బయలుదేరి రావల్సిందనీ వ్రాశాడు. వ్రాసిన మూడోనాటికే మోహనరావు మదరాసు చేరాడు.

★

మదరాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగీ దిగటంతోటే మిత్రుడు రామారావు కనపడ్డాడు. అతనితో అతని యింటికి వెళ్ళాడు. దారి పొడుగునా రామారావు సుశీల సంగతి తూచాతప్పకుండా చెప్పివేశాడు. మోహనరావు మనసులో కొంచెం దుఃఖించినా బయటికిమాత్రం గంభీరంగానే యున్నాడు. తర్వాత మిత్రునివద్ద సెలవు పుచ్చుకుని మామగారింటికి వెళ్ళాడు.

యింటిఅల్లుడురాక అందరికీ ఆశ్చర్య మేసింది. జాబూ వ్రాయకుండానే బయలుదేరి వచ్చే డేమిటూ అని. మామగారు కుశలప్రశ్నలు వర్షధారగా కురిపించారు. అన్నిటికీ వినయంగానే అల్లుడుగారు జవాబిచ్చారు.

★

మోహనరావు వచ్చి నెలరోజు లవుతూ యుంది. ఏమిషమీద పెళ్లాన్ని చదువు నిలిపించి కాపరానికి తీసుకొనివెళ్లడమా అనే సందేహం పుట్టింది. మామగారిని అడగడానికి కొంచెం సంకోచించాడు. ఇంతలోకే సుశీల ప్రవేశికపరీక్షలో తప్పినట్లు తెలిసాయి. ఇదే

మంచి తరుణం దొరికిందని సంతోషించాడు. మామ గారితో "మరి సుశీల తప్పిపోయిందిగదా! ఇంక ఏమి చదువుతుంది లెండి" అని మెల్లిగా అన్నాడు.

"అవును, ప్రిరెజిస్ట్రేషన్ పరీక్షలో తప్పింది. అయినా పెండ్లి అయిన పిల్ల ఏమి చదువుతుంది." అన్నాడు మామగారు.

"అయితే కనుక్కోండి. మా యింటికి తీసుక వెళ్తాను."

"దాన్ని కనుక్కునేదేంటి నీ యిష్టానికి కాదంటూనా నేను."

"సరే"

ఆఖరుకు సుశీల చదువు నిలిపేసి భర్తతో వెళ్లాలసి వచ్చింది. సుశీల మొదట తాను చదువుతానని, ఇప్పుడే అత్తగారింటికి రాననీ పట్టుపట్టింది. కాని తన భర్త, తలిదండ్రులు అంతా పట్టినారు కనుక చదువుకు నీళ్లు వదలాలిసి వచ్చింది. ఆఖరుకు భర్తతో కాపరానికి వెళ్లిపోయింది.

★

కొత్తగావచ్చిన కొత్తకోడళ్లు అందరిలాగానే అత్తగారి యింటి వాతావరణం సుశీలకు నచ్చలేదు. ఏలాగో తన్నుతాను సమదాయించుకుని నాలుగు నెలలు గడిపింది. ఇక అక్కడుండలేక పోయింది. భర్తను వేధించి పుట్టింటికి ప్రయాణంకట్టింది.

★

మదరాసులో మళ్లీ బీచిలో ప్రసాద్‌ను కలుసుకునేది. ఇల్లా రెండు నెలలు జరిగింది. మోహనరావు వచ్చి మళ్లీ సుశీలను తనతో తీసుకొని వెళ్లాడు. మళ్లీ అక్కడ రెండుమూడునెల లుండటం తర్వాత మదరాసుకు ప్రయాణం కట్టడం ఇలా జరిగింది. పోనీ పుట్టింటికి పోయింది అని వూరుకుంటే మదరాసులో నడత తిన్నగా లేకపోతే ఏలాగు? మోహనరావును అందరూ, ఇంటర్ చదివిన పెళ్లాన్ని కోరి చేసుకున్నందుకు అనుభవిస్తువులే" అని చెప్పుతున్నారు. భందువులలోనూ, స్నేహితులలోనూ తల ఎత్తలేక పోతున్నాడు. అయితే భార్యను మాత్రం ఏమీ అనలేక పోయేవాడు. అంత తన కర్మవల్ల ఇలా జరుగుతూయుందని అనుకునేవాడు. ఇలాగే రెండు, మూడుసార్లు జరిగింది. ఒకసారికంటే ఇంకొక సారికి సుశీల నడత తిన్నగా వుంటం లేదు. ప్రసాద్‌తో స్నేహం రోజుకు రోజుకూ ఎక్కువవుతూ యుంది. ఆమె తీరు రోజురోజుకూ వెల్లడియైపోతోంది. మోహన్ ఇక ఓర్వలేక పోయాడు. నిర్భయంగా పెళ్లాన్ని అడిగాడు.

"ఇలా జరుగుతూవుంటే నేను చూడలేను. ఇంతవరకేదో అయిపోయిందికానీ. ఇకనైనా సరియైన మార్గంలోకి రా." అన్నాడు.

అందుకు ఆమె మొగమాటంలేకుండా, "నేను నా యిష్టం వచ్చినట్లు వుంటాను. మీరు నన్నుగురించి ఏమి ఆడగక్కర్లేదు" అనింది.

మోహన్‌కు ప్రపంచమంతా తిరిగి పోతూన్నట్లు తోచింది. ఇక నిలవలేక పోయాడు "సరే నీయిష్టం వచ్చినట్లు సుఖించు. అయితే ఒకప్పుడు నేనన్నమాటలు జ్ఞప్తి చేసుకొని దుఃఖపడుతావు" అన్నాడు.

ఆమె అతని మాటలను వినీ విననట్టూరుకుంది.

మోహన్‌కు జీవితంపైన అసహ్యంపుట్టింది. ఇంటర్ వైఫ్‌ను చేసుకున్నందుకు తనకు నలుగురిలో అప్రతిష్ట కలిగిందని విచారం అతన్ని వేపుకు తింటోంది. తన మామగారి యింట్లోనుంచి తన సూటుకేసుతోటి బయలుదేరి నేరుగా సెంట్రల్ స్టేషన్‌కువచ్చి కలకత్తా మెయిలెక్కాడు.

★

కొన్నాళ్లకు మోహనరావు మనోవ్యాధితో మరణించాడని అటుతరువాత ప్రసాదరావు సుశీల విధవావివాహం చేసుకొన్నారని సమాజ పత్రికలో ప్రకటించారు.


## చేతిపనుల వర్తక రహస్యబోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 200 గలవు. ధర 1 రూపాయి. పోస్టుఖర్చులు 5 అణాలు.

### కొక్కోకము

స్త్రీపురుష రహస్యములు 64 చిత్రపటములతో 270 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు 1-0-0. పోస్టుఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు. శయ్యాగృహ మర్మములు గలవు.

### ముద్దులు మర్మములు

పడకటి ముచ్చటలు, రతిసంబంధమయిన అనేక మర్మవిషయము లిందు గలవు. 8 పటములతో 148 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు. 0-8-0. పోస్టుఖర్చులు 0-5-0. కొక్కోకము, ముద్దులు మర్మములు ఒకేదఫా రెండుకొనిన పోస్టుఖర్చులతో రు. 1-12-0.

మహారాజ పుస్తకశాల,
అరుణాచల మొదలివీధి, 18 బీటు; మద్రాసు.